నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, బుధవారం 19 మార్చి 2025 | VIKARABAD


## బీఆర్ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు



ఇబ్రహీంపట్నం, మార్చి 18 : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అందులో భాగంగా ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, మున్సిపల్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మడుపు శివసాయిలను ఇబ్రహీంపట్నం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చే వరకు వెంటాడుతామని తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి



జడ్పీహెచ్ఎస్‌లో వార్షికోత్సవంలో పాల్గొన్న డీఈవో సుశీందర్‌రావు

కొత్తూరు, మార్చి 18 : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని జడ్పీహెచ్ఎస్ వార్షికోత్సవంలో డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రైవేటుకు ధీటుగా నిర్వహించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉన్నారు.

# మా భూముల జోలికొస్తే ఊరుకోం

- ఫ్యూచర్ సిటీలో 822.11 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- పచ్చని పొలాల్లో పరిశ్రమలు వద్దేవద్దని మొండిగౌరెల్లి గ్రామస్తుల ఆందోళన
- గ్రామంలో రైతులు, యువకుల సమావేశం
- తమ భూములను కాపాడుకోవడానికి సంఘటితం
- లగచర్ల మాదిరిగా ఉద్యమం చేయడానికి సిద్ధమంటున్న గ్రామస్తులు
- ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా
- ఆర్డీవో, తహసీల్దార్‌లకు అన్నదాతల వినతిపత్రం



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మొండిగౌరెల్లి గ్రామ రైతులు

ప్రభుత్వం నుంచి తమ భూములను కాపాడుకోవడానికి మండలంలోని మొండిగౌరెల్లి గ్రామ రైతులు సంఘటితమయ్యారు. పచ్చని పొలాల్లో పరిశ్రమల ఏర్పాటు వద్దేవద్దు అంటూ నినదించారు. ప్రభుత్వానికి సెంటు భూమి కూడా ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. ఇకపై రైతుల భూముల జోలికొస్తే ఊరుకునేదిలేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూములను కాపాడుకోవడం కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని గ్రామస్తులు, రైతులు, యువకులు ప్రతినబూనారు. లగచర్ల మాదిరిగా గ్రామంలో ఉద్యమం చేయడానికి సిద్ధం కావాలని మూకుమ్మడిగా తీర్మానించారు. గ్రామంలో నాయకులు తాండ్ర రవీందర్, బండిమీది కృష్ణ, అంజయ్యయాదవ్, మేకల యాదగిరిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో మంగళవారం రైతులంతా ఒకచోట సమావేశమయ్యారు. ఫ్యూచర్ సిటీలో భాగంగా గ్రామంలోని 19, 68, 127 సర్వే నంబర్లలో ఉన్న అసైన్డ్‌తో పాటు మరి కొంత పట్టా భూమి కలిపి మొత్తం 821.11 ఎకరాల భూమిలో పారిశ్రామికవాడను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రైతుల ఆమోదం లేకుండానే పచ్చని పంట పొలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. సాగు భూములను ప్రభుత్వం తీసుకోవడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. ప్రభుత్వ తీరును గ్రామస్తులు, రైతులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

- యాచారం/ ఇబ్రహీంపట్నం, మార్చి 18

గ్రామస్తులు, మహిళలు, రైతులు, యువకులు భూసేకరణకు వ్యతిరేకంగా ఉద్యమం లేవదీశారు. గ్రామం నుంచి డీసీఎంతో పాటు, కార్లు, ద్విచక్రవాహనాలపై పెద్దఎత్తున ఇబ్రహీంపట్నం ఆర్డీవో ఆఫీస్‌ను ముట్టడించారు. తమ భూములను పరిశ్రమలకు తీసుకోవద్దని, భూసేకరణ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అనంతరం రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో అనంతరెడ్డికి రైతులు, పలు పార్టీల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. రాళ్లు, గుట్టలతో కూడిన బీడు భూములను ప్రభుత్వానికి ఇవ్వాలని ఆర్డీవో సూచించగా.. బీడు భూములు కావని, సాగుతో కూడిన భూములని రైతులు ఆయనకు విన్నవించారు. రెండు రోజుల్లో గ్రామాన్ని సందర్శించి భూములను పరిశీలించనున్నట్లు రైతులకు తెలిపారు.

### రాజకీయాలకతీతంగా ఉద్యమం ఉధృతం

అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సైతం ముట్టడించారు. కొద్దిసేపు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ అయ్యప్పకు రైతులు వినతిపత్రం అందజేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ రైతులకు తెలిపారు. రాజకీయాలకతీతంగా గ్రామస్తులమంతా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కలెక్టర్ కార్యాలయం, సెక్రటేరియట్‌లను కూడా ముట్టడిస్తామన్నారు. తమ గ్రామాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలని వినతిపత్రాలు ఇస్తే.. గ్రామంలో ఉన్న రైతుల భూములను లాక్కునేందుకు రేవంత్ సర్కారు ప్రయత్నాలు చేస్తున్నదని.. వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. ఏది ఏమైనా గ్రామంలో సెంటు భూమిని కూడా ఇచ్చేదిలేదని వారు తేల్చి చెప్పారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులే తగిన బుద్ధి చెబుతారని వారు పేర్కొన్నారు.

### చూస్తూ ఊరుకోం..



గ్రామంలోని పచ్చని పంట పొలాలను పారిశ్రామిక పార్కుల పేరుతో లాక్కుంటామని చూస్తే ఊరుకునేది లేదు. మా గ్రామంలో 100 మందికి పైగా రైతులందరం సమావేశం ఏర్పాటు చేసుకుని తహసీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు సమర్పించాం. మా భూముల కోసం అవసరమైతే మా ప్రాణాలైనా తీసుకుంటాం. కన్నతల్లి లాంటి మా భూములను మాత్రం ఇచ్చేదిలేదు.

- బొరిగ యాదయ్య, రైతు, మొండిగౌరెల్లి

### లగచర్ల ఘటన పునరావృతం అవుతుంది



రైతుల భూముల్లో బలవంతంగా భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తే మొండిగౌరెల్లిలో మరో లగచర్ల ఘటన పునరావృతం అవుతుంది. అధికారులు భూసేకరణ, సర్వేల కోసం గ్రామానికి వచ్చే అధికారులను గ్రామం నుంచి తరిమితరిమి కొడతాం. అధికారులు, ప్రభుత్వం రైతులపై ఎంత ఒత్తిడి చేసినా భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేం. బలవంతంగా భూములు లాక్కుంటే గ్రామంలో తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుంది. సాగు భూములు వదులుకొని ఎలా జీవించాలి. లగచర్ల రైతుల స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తాం. రైతుల భూములను కాపాడుకుంటాం.

- గూడాల వెంకటేశ్, మొండిగౌరెల్లి

### పరిశ్రమల పేరుతో చిచ్చుపెడితే సహించేది లేదు



మా తాతల కాలం నుంచి భూమిని నమ్ముకుని జీవిస్తున్నాం. వ్యవసాయం చేసుకుని బతుకుతున్న మాలాంటి వారికి ఉన్న భూముల్లో అనవసరమైన కంపెనీలు ఏర్పాటు చేసి మా జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తామంటే సహించేదిలేదు. మా భూములు మా సొత్తు.. ఎవడు వచ్చినా ఉరికించికొడతాం.. భూములను కాపాడుకుంటాం.

- మండల బాలకృష్ణ, మొండిగౌరెల్లి



డీసీఎంలో ఆర్డీవో కార్యాలయ ముట్టడికి వెళ్తున్న రైతులు

### సెంటు భూమిని కూడా ఇవ్వం



గ్రామంలో పరిశ్రమల ఏర్పాటు కోసం అక్రమంగా భూసేకరణ చేస్తే ఊరుకునేదిలేదు. పారిశ్రామికవాడకు సెంటు భూమిని కూడా ఇవ్వం. పోలీసుల కేసులు, అధికారుల బెదిరింపులకు భయపడేదిలేదు. రైతులతో కలిసి ఎంతటి ఉద్యమానికైనా వెనుకాడేదిలేదు. సాగు చేసుకునే భూములను వదులుకునే ప్రసక్తే లేదు. ప్రభుత్వం వెంటనే భూసేకరణను ఉపసంహరించుకోవాలి. లేదంటే ఆందోళనలు తప్పవు. రైతులతో పెట్టుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా నష్టపోతుంది. రేవంత్‌రెడ్డి సర్కారుకు త్వరలో రైతులే తగిన బుద్ధి చెప్పడం ఖాయం. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేసుకోవాలి.

- తాండ్ర లక్ష్మమ్మ ఎంపీటీసీ, మొండిగౌరెల్లి



మొండిగౌరెల్లిలో సమావేశమైన రైతులు

# కల్వకుర్తిపై కనికరమేది..?

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 182 కోట్లతో 90 శాతం కాల్వల నిర్మాణం పూర్తి

ఎత్తిపోతల పథకంలో భాగంగా కాల్వ చివరి గ్రామాల రైతులకు నీళ్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ


- నీరివ్వకపోవటంతో మాడ్గుల, ఆమనగల్లు మండలాల్లో ఎండిపోతున్న పంటలు

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపటంలేదు. ఈ పథకం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలోని రంగారెడ్డి జిల్లాలోగల మాడుగుల, ఆమనగల్లు మండలాల్లోని తదితర ప్రాంతాలకు సాగునీరు ఇవ్వాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.182 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో కాల్వల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరిపారు. అనంతరం కాల్వల నిర్మాణం కూడా 90 శాతం పూర్తయింది. ప్రభుత్వం మారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టు పురోగతిపై శ్రద్ధచూపటంలేదు. ఫలితంగా కాల్వల్లో చెట్లు మొలిసి అస్తవ్యస్తంగా మారాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తామని, జంగారెడ్డిపల్లి నుంచి మోటర్ల ద్వారా సాగునీటిని మాడ్గుల, ఆమనగల్లు మండలాలకు అందిస్తామని హామీ ఇచ్చింది. కాని, ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవటంతో పనులు ముందుకు సాగటంలేదు. దీంతో మాడ్గుల, ఆమనగల్లు మండలాల్లో సాగునీరు లేక పంటలు పెద్దఎత్తున ఎండిపోతున్నాయి.

- రంగారెడ్డి, మార్చి 18 (నమస్తే తెలంగాణ)



నిలిచిపోయిన కాల్వ నిర్మాణ పనులు



ఎండిపోయిన వరి, వేరుశనగ పంటలు



మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలకు సాగునీటి సౌకర్యం లేకపోవటం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భావించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలోని 80 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెల్దండ, చారకొండ, కల్వకుర్తి మండలాలకు సాగునీటిని కూడా అందించింది. కాని, ప్రభుత్వం మారటంతో మాడుగుల, ఆమనగల్లుకు నీరందించలేకపోయింది. అధికారంలోకి వస్తే ఈ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసి ఈ రెండు మండలాలకు సాగునీరు అందిస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. కాని, నేటికీ హామీని నెరవేర్చలేకపోయారు.

### మాడుగులతో విడదీయరాని బంధం

సీఎం రేవంత్‌రెడ్డికి మాడుగుల మండలంతో విడదీయరాని బంధం ఉన్నది. ఆయనకు అత్యంత సమీప బంధువులు, ఆయన మామలు కూడా మాడుగుల మండలంలోనే ఉన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయితే తమ గ్రామాలకు సాగునీరు అందుతుందని ప్రజలు ఆశించారు. అయినా సాగునీరు మాత్రం రావటంలేదు. సాగునీరు అందించి రైతులను కాపాడాలని కోరుతున్నారు.

### ఎత్తిపోతల పథకంలో నీరు రావాల్సిన గ్రామాలు

మాడ్గుల మండలంలోని మాడుగుల, ఆవుర్‌పల్లి, దొడ్లపాడు, నల్లవారిపల్లె, నాగిళ్ల, కలకొండ, తుర్కలకుంట, ఎండిపురం, ఆమనగల్లు మండలంలోని పోలెపల్లి, సింగంపల్లి, శంకరకుంట తండా, మేడిగడ్డతండా. ఈ గ్రామాలకు కాల్వలు కూడా తవ్వారు.

### నీళ్లు రాక ఎండుతున్న పంటలు

ప్రతిపాదిత కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగమైన కాల్వ చివరి గ్రామాలకు సాగునీరు రాకపోవటంతో వరి, వేరుశనగ, మిర్చి పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి బోర్లు సైతం ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితిలో సాగునీరు అందించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

### సాగునీరు అందించాలి



కల్వకుర్తి ఎత్తిపోతలలో భాగమైన కాల్వ చివరి గ్రామాలకు సాగునీరు అందించాలి. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం. పంటలు మధ్యలోనే ఎండిపోతున్నా పట్టించుకోవటంలేదు. కాంగ్రెస్‌వాళ్లు ఎన్నికల ముందు కల్లబొల్లి మాటలు చెప్పారు. కాల్వల నిర్మాణం పూర్తిచేస్తామని, చివరి గ్రామాలకు నీరందిస్తామని చెప్పారు.

- ఏర్పుల శివలింగం, ఆర్కపల్లి

### రైతులను ఆదుకోవాలి



కాల్వ చివరి గ్రామాలకు నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి, వేరుశనగ, మిర్చి పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలు అడుగంటి బోర్లు సైతం ఎండిపోతున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా పంటలను సాగుకోసం కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించేందుకు కాల్వల నిర్మాణం పూర్తిచేయటం కోసం నిధులు కేటాయించాలి. గత ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తిచేసినప్పటికీ 10 శాతం పనులు పూర్తిచేయటంలో ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవటంలేదు. పెట్టిన పెట్టుబడి కూడా రాలేని పరిస్థితితో ఇబ్బందులు పడుతున్నాం.

- కల్లా రాజువర్ధన్‌రెడ్డి, ఆర్కపల్లి



# అంధకారంలో ఆశల జీవితాలు

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక భరోసా
కాంగ్రెస్ పాలనలో వెట్టిచాకిరి

- సర్వేలు చేసినా డబ్బులు ఇస్తలేరు
- కేసీఆర్ కిట్ లేక తగ్గిన డెలివరీలు
- పనిభారంతో అనారోగ్య సమస్యలు

సిటీబ్యూరో, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : నిత్యం పేద ప్రజల ఆరోగ్యాలను పర్యవేక్షిస్తున్న ఆశ వర్కర్ల జీవితాలు అంధకారంలోకి చేరాయి. అధికారంలోకి రాగానే ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కేస్తున్నది. హైదరాబాద్‌లో ఉన్న సుమారు 1650 మంది ఆశవర్కర్లు నిత్యం ప్రజల్లో ఉంటూ ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పలు ఆరోగ్య సర్వేలు చేస్తున్నారు. ఎన్‌సీడీ, క్షయ, ఫైలేరియా, ఫీవర్ వంటి సర్వేల్లో పాల్గొంటూ టార్గెట్లను అధిగమించి పనిచేస్తున్నారు. ఈ సర్వేలకు ప్రభుత్వం పారితోషికం ఇవ్వాల్సి ఉన్నది. ఇప్పటివరకు సర్వేలు ఎన్ని చేసినా ఆశలకు డబ్బులు ఇవ్వని పరిస్థితి నెలకొన్నది. సర్వేలతోపాటు సెంటర్లలో విధులు నిర్వహించే వాళ్లను ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నది. మరోవైపు జిల్లాలో 128 ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉండటంతో సిబ్బంది కొరత ఉన్న సెంటర్లలో ఏఎన్ఎంలు చేయాల్సిన ఎంసీహెచ్, ఎన్‌సీడీ వివరాలు ఆన్‌లైన్ ఎక్కించే పనిని కూడా ఆశలే చేస్తుండటం గమనార్హం. పనిభారంతో అనారోగ్య సమస్యలకు గురవుతూ, ఉద్యోగాలు వదిలే పరిస్థితి నెలకొన్నది.

### తగ్గిన డెలివరీ నమోదులు..

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్ వల్ల అనేక మంది పేదలు ప్రసవాల కోసం ప్రభుత్వ దవాఖానల్లో చేరేవారు. ఆశ వర్కర్లతో వారి పేరు నమోదు చేయించుకునేవారు. డెలివరీ సమయంలో కూడా పేరు నమోదు చేసుకొని వారికి కేసీఆర్ కిట్ అందించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేసీఆర్ కిట్‌కు బదులు ఎంసీహెచ్ కిట్‌గా పేరు మార్చి ఇవ్వడమే మానేసింది. దీంతో గర్భిణులు ఆశవర్కర్ల వద్దకు రావడమే మానేశారు. అధికారులు ఇవేవీ పట్టించుకోకుండా తప్పనిసరిగా ఒక ఆశ వర్కర్ నెలలో ఐదుగురు గర్భిణులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, అది కూడా 12 వారాల వారిని మాత్రమే నమోదు చేయాలంటూ ఆదేశాలిస్తున్నారు. డెలివరీ కేసుల నమోదు ఆధారంగా రివ్యూస్ ఇచ్చి వేతనాలు ఇస్తుండటం గమనార్హం. కేసీఆర్ కిట్‌లేకపోవడం, ప్రస్తుతమున్న కిట్ అమలు చేయకపోవడంతో డెలివరీ కేసుల నమోదు తగ్గుదల ఏర్పడటం వల్ల ఆశ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే ఆశల వేతనాలు పెంచి, వారికి ఆర్థిక భరోసానిచ్చింది.


### గుర్తింపు ఇస్తలేరు



బీఆర్ఎస్ ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ఆశ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నాటి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్షలు నిర్వహించి మా సాధకబాధకాలు తెలుసుకునేవారు. ప్రస్తుతం ఆస్పత్రులకు వెళ్తే కనీస గుర్తింపు ఇవ్వకుండా చూస్తున్నారు. పని ఒత్తిడికి గురవుతున్నా కూడా వేతనాలు, ఉద్యోగ భద్రత ఇవ్వకకుండా ప్రభుత్వం మోసం చేస్తున్నది.

- రావుల సంతోష, బీఆర్‌టీయూ సంఘం ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు

### హామీలు మరిచారు



హైదరాబాద్ జిల్లాలో పనిచేసే ఆశలపై అధిక పనిభారం పడుతున్నది. సర్వేలు చేయించుకుంటున్నా డబ్బులివ్వడంలేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే ప్రభుత్వం విస్మరించింది. మా సొంత డబ్బులతో పలుసార్లు ఆసుపత్రులకు పేషెంట్లను తీసుకెళ్తున్నాం. సర్వేలు చేయించుకున్న డబ్బులు ఇప్పించండి.

- యాదమ్మ, సీఐటీయూ సంఘం ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు